క్లుప్తంగా

విరిగిన విద్యుత్ స్తంభాలు

ముదిగొండ: మున్నేరు వరద ప్రభావంతో మండలంలో పొలాల్లోని విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగాయి. పండ్రేగుపల్లిలో 40 పైగా విద్యుత్ స్తంభాలు విరగగా, 8 ట్రాన్స్‌ఫార్మర్లు మునిగినట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయనున్నట్లు ఏఈ తెలిపారు.

'గిరిజన సింహగర్జన'ను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏన్కూరు: ఈ నెల 9న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే గిరిజన సింహగర్జనను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు బాణోతు శ్రీకాంత్ నాయక్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో సేవాలాల్ సేన ఆవిర్భావ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్లావత్ చందు, గోపి, వినోద్, కృష్ణప్రియ, లక్ష్మీభాయి, తన్మయిభాయి పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోండి..



బాధితుల్ని పరామర్శిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: తుఫాన్ బాధితులను తక్షణమే ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని వరద బాధితులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన విధంగా ప్రతి కుటుంబానికి తక్షణసాయంగా రూ.10 వేలు సాయం అందించాలని కోరారు.

రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో మంగళవారం రుణమాఫీ కాని రైతుల నుంచి మండల వ్యవసాయాధికారి ఎం.రాధ దరఖాస్తులు స్వీకరించారు. రేమిడిచర్ల, ఎర్రుపాలెం, కొత్తపాలెం, రామాపురం గ్రామాలకు చెందిన పలువురు రైతుల నుండి దరఖాస్తులను ఏఓ స్వీకరించారు. దరఖాస్తులను నేరుగా ఏఓ ఆన్‌లైన్ చేశారు. బాలకృష్ణ, సింధూర్, తదితరులున్నారు.

తల్లాడ: మండలంలోని మిట్టపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రేషన్ కార్డు ఉండి రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల సర్వే నిర్వహించారు. మండల వ్యవసాయాదికారి ఎండి.తాజుద్దీన్ ఆధ్వర్యంలో మిట్టపల్లి రైతువేదికలో గ్రామసభ నిర్వహించి రైతుల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు త్రివేణి, మాధవి, సాయికుమార్ పాల్గొన్నారు.

దాడి హేయం

ఎర్రుపాలెం: ఖమ్మం పట్టణంలో వరద ప్రాంతాలను సందర్శించి బాధితులకు భరోసా ఇవ్వడానికి వచ్చిన మాజీ మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ దాడిని ప్రజాస్వామిక వాదులు అందరూ ఖండించాలని పేర్కొన్నారు.

మద్యం మత్తులో వీరంగం

మధిర: మధిరలోని ఆర్‌వీ కాంప్లెక్స్ సమీపాన ఇద్దరు యువకులు మంగళవారం మద్యం మత్తులో వీరంగం చేశారు. స్థానిక శివాలయం, ఎన్జీవోస్ కాలనీకి చెందిన వారు మద్యం మత్తులో రైల్వే ఓవర్ బ్రిడ్జి మెట్ల వద్ద బ్లేడ్‌తో చేతులు, మెడపై కోసుకుంటూ హల్‌చల్ చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, ప్రతిరోజు ఆర్‌వి కాంప్లెక్స్ సమీపాన వైన్స్ వద్ద పలువురు మద్యం సేవించి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోయారు.

ఉపేందర్‌కు ఎల్‌ఐసీ అవార్డు

మధిర: మధిర పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తూములూరి ఉపేందర్‌కు ఎల్‌ఐసీ వారి ఆధ్వర్యంలో గుడ్ కస్టమర్ అవార్డు దక్కింది. ఎల్‌ఐసీ వారోత్సవాలు సందర్భంగా మధిర బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎక్కువ ప్రీమియంతో పాటు సకాలంలో ప్రీమియం చెల్లిస్తున్న గుడ్ కస్టమర్‌గా తూములూరి ఉపేందర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక వైరా రోడ్డులోని వారి ఐరన్ షాపులో ఉపేందర్, కమలకుమారి దంపతులను మధిర బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ బి.హతి ఘనంగా సన్మానించారు.

వరద మిగిల్చిన నష్టం..



చింతకాని: మత్కేపల్లి గచ్చుబంధం వద్ద వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు

పంటలకు తీవ్ర నష్టం..

మధిర: వర్షానికి అన్ని పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని అనేక రహదారులు వరద తాకిడికి ధ్వంసమయ్యాయి. చిలుకూరు నుంచి అన్నవరం, దెందుకూరు వెళ్లే గ్రామాలతో పాటు రాయపట్నం, రొంపిమళ్ల, మాటూరు, మడుపల్లి తదితర గ్రామాల్లోని రహదారులపై వరద ఉధృతికి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నియోజకవర్గంలో సాగు చేసిన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షంతో పాటు గాలి వీచడం, తేమ ఎక్కువై, వరద ప్రవాహానికి పత్తి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి.

నియోజకవర్గంలో...

మధిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో మొత్తం 97 గ్రామాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. నియోజకవర్గంలో 18,305 ఎకరాల్లో 11,097 మంది రైతులు సాగు చేసిన పత్తి, 470 ఎకరాల్లో 197 మంది రైతులు సాగుచేసిన పెసర పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అదేవిధంగా 75 గ్రామాల్లో 1,353 మంది రైతులు సాగు చేసిన 2,529 ఎకరాల్లో మిర్చి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. 9,842 మంది రైతులు 13,777 ఎకరాల్లో సాగుచేసిన వరికి నష్టం జరిగింది.



ఇల్లెందులపాడు గ్రామంలో దెబ్బతిన్న పత్తి

నీట మునిగిన పంటలు..

తల్లాడ: తల్లాడ మండలంలో భారీ వర్షాల కారణంగా పైర్లకు నష్టం వాటిల్లింది. పత్తి, మిర్చి, వరి పైర్లు వరద ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగి పొర్లిన దగ్గర, దిగువన ఉన్న భూముల్లో వరద నీరు చేరి నష్టం వాటిల్లింది. మండలంలో ఇప్పటి వరకు 6 వేల ఎకరాల్లో పత్తి , 6 వేల ఎకరాల్లో వరి, 2 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. సాగు చేసిన ఈ పైర్లలో వ్యవసాయ శాఖా ప్రాథమిక అంచనా ప్రకారం 2,500 ఎకరాల వరికి, 1,900 ఎకరాల్లో పత్తి పైరుకు వరద నీరు పట్టింది. మంగళవారం కూడా పలు చోట్ల వరద నీటిలోనే పత్తి, వరి పైర్లు ఉన్నాయి. పత్తి పూత దశలో ఉండగా భారీ వర్షంతో పూత రాలిపోయింది. వరి పైరు పలు గ్రామాల్లో వరదకు కొట్టుకుపోయింది. అలాగే మిర్చి రైతులకు కూడా తీవ్రంగానే నష్టం వాటిల్లింది. మల్లవరం, అన్నారుగూడెం, పినపాక, మిట్టపల్లి, బిల్లుపాడు, రామచంద్రాపురం, రేజర్ల, తల్లాడ, గొల్లగూడెం, కుర్నవల్లి, కేశ్వాపురం గ్రామాల్లో వరద నీరు పొలాల్లో చేరి నష్టం వాటిల్లింది. ఆగస్టు నెలాఖరులోనే మిర్చి పంట వేయడం ప్రారంభించారు. దుక్కులు దున్ని వేలాది రూపాయలు పెట్టి నర్సరీల్లో నుంచి మిర్చి నారు తెచ్చి కూలీలతో నాటారు. నాటిన వారం రోజుల్లోనే భారీ వర్షాలు కురిశాయి. దీంతో వరద పోటెత్తి మిర్చి మొక్కలు నేల వాలి పోయాయి. ఇసుక మేటలకు గురై మిర్చి మొక్కలు చనిపోయాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతుకు కన్నీరు మిగిల్చింది. పంటల నష్టంపై తల్లాడ మండల వ్యవసాయదికారి ఎండి.తాజుద్దీన్‌ను అడగగా 2,500 ఎకరాల్లో వరి, 1,900 ఎకరాల్లో పత్తి పైర్లకు వర్షం నీరు పట్టిందని, పైర్లకు కొంత నష్టం వాటిల్లిందని, దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.



వరిపొలంలో నిలిచిన వరద నీరు

ధ్వంసమైన రహదారులు..

చింతకాని: వరద బీభత్సానికి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. చింతకాని నుంచి ప్రొద్దుటూరు, పాతర్లపాడు, రేపల్లెవాడ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి చింతకాని వాగు వద్ద వరద ఉధృతికి పూర్తిగా ధ్వంసమైంది. చింతకాని- నేరడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దాసరిబంధం వద్ద తెగిపోయింది. అలాగే పందిళ్లపల్లి వద్ద ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారి వరదకు కోతకు గురైంది. మత్కేపల్లి మున్నేరు వంతెన వద్ద రహదారి కోతకు గురై అత్యంత ప్రమాదకరంగా ఉంది. మత్కేపల్లి-తిరుమలాపురం వెళ్లే రహదారి గచ్చుబంధం వద్ద మూడు చోట్ల పూర్తిగా ధ్వంసమైంది. ప్రొద్దుటూరు నుంచి నేరడ వెళ్లే రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు నిలిపివేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి ధ్వంసమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. వర్షం తగ్గినప్పటికీ గ్రామాల్లోని వాగుల్లో వరద తగ్గక ఇంకా పలు పొలాలు నీటిలోనే మునిగి ఉన్నాయి. వరద నీటికి వరి, పత్తి, మిర్చి పంట పొలాలు కొట్టుకపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద సృష్టించిన బీభత్సంతో నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయాధికారులతో సర్వే నిర్వహించి నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు..



మధిర: చిలుకూరు- అన్నవరం గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు



కొట్టుకుపోయిన ప్రొద్దుటూరు, రేపల్లెవాడ, పాతర్లపాడు వెళ్లే ప్రధాన రహదారి



కానుకలను ఎండపెడుతున్న ఆలయ సిబ్బంది

తడిసిన హుండీ..

మధిర: మధిర పట్టణంలోని వైరా నది ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ మృత్యుంజయ స్వామి ఆలయం హుండీ వరద తాకిడికి తడిసింది. ఆలయంలో ఉన్న హుండీ లోపలికి నీరు చేరి కానుకలు, కరెన్సీ నోట్లు తడిచిపోయాయి. మక్కెన నాగేశ్వరరావు సహకారంతో ఆలయ అధికారుల సమక్షంలో మంగళవారం జాగ్రత్తగా హుండీ నుంచి వచ్చిన డబ్బులను ఎండబెట్టి వాటిని లెక్కించారు.

నిల్వ నీటితో ఇక్కట్లు



పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

వైరా: నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వైరాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోయాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దోమలు వృద్ధి పెరిగింది. విద్యార్థినుల సౌకర్యార్థం నిల్వ నీటిని బయటకు వెళ్లేలా తగు చర్యలు తీసుకోని దోమల నివారణ బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కొత్తకుంట చెరువుకు గండి



కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో కొత్తకుంట చెరువుకు మంగళవారం గండిపడింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండిపోయి చెరువుకట్ట కోతకు గురికావటంతో గండిపడింది. ఈ చెరువు కింద సుమారు 123 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. చెరువుకు గండిపడటంతో ఆయకట్టు పొలాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

ఆదుకోవాలని వేడుకోలు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం, ఎర్రుపాలెం, మీనవోలు, బనిగండ్లపాడు, రేమిడిచర్ల, భీమవరం, ఇనగాలి, సఖినవీడు, రామన్నపాలెం, తక్కెళ్లపాడు తదితర గ్రామాల్లో పత్తి , వరి పంట పొలాల్లో వరదలకు నీట మునిగి దెబ్బతిన్నాయి. కట్లేరు పరివాహక ప్రాంతమంతా జలమయంగా మారడంతో పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. పత్తి చేలకు నీరు చిప్పుపడి నల్లగా మాడిపోయినట్లుగా తయారయ్యాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరద పాలయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



నల్లగా మారిన పత్తి మొక్కలు

అంతా వరద పాలయింది



మూడున్నర ఎకరాల భూమిని రూ.25వేలకు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. మరో ఎకరం సొంత పొలంలో కూడా పత్తి వేశా. సాగు నిమిత్తం దాదాపు రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. తుఫాన్ ప్రభావంతో కట్లేరుకు వచ్చిన వరద పుణ్యమా అంటూ నీట పాలయింది. నష్టాల పాలైన మమ్ము ప్రభుత్వం ఆదుకోవాలి.

– షేక్ బాబు, రైతు, పెద్దగోపవరం

వరి పొలం మునిగింది



పెద్దగోపవరం గ్రామంలో ఎకరన్నర పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. ఇప్పటికే రూ.20వేలకు పైగానే పెట్టుబడి పెట్టాను. పొలం వాగు పక్కనే ఉండటంతో కొట్టుకుపోయింది. పొలం అంతా మునిగింది. దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలి.

– కరీముల్లా బాజీ, ఎర్రుపాలెం

రైతులను ఆదుకోవాలి



వరిపొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కొణిజర్ల: వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందివ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పగిడేరు పరివాహక ప్రాంతంలో వరదకు నష్టపోయిన పంటలను ఆ సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ విపత్తుల నిధుల నుంచి రాష్ట్ర వాటా రాబట్టి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు రూ.10 వేలు, నుంచి వాణిజ్య పంటలకు రూ 50 వేలు వరకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ముంపునకు గురైన విద్యుత్ మోటర్లు, పైప్‌లైన్లు పునరుద్ధరించుకోడానికి రైతులకు తలకు మించిన భారం అవుతుందన్నారు. రైతులు మండవ బ్రహ్మేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, సీతారాములు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు వితరణ



వైరా: బాధితులకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వరద బాధిత కుటుంబాలకు వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ బియ్యం, వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందించిన భోజన ప్లేటులు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, డాక్టర్ అసోసియేషన్ చైర్మన్ దారెల్లి కోటయ్య, ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, పాలేటి నర్సింహరావు, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, కొప్పురావూరి శబరినాథ్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, దర్శి చెన్నారావు, వెంపటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని యడవల్లి లక్ష్మీపురం, న్యూ లక్ష్మీపురం, పండ్రేగుపల్లి, గంధసిరి గ్రామాల్లోని ముంపు ప్రాంత వాసులకు, వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ టి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆర్‌ఐ వహీద, సిబ్బంది రవీందర్ ఉన్నారు.



ముదిగొండలో..



తల్లాడ: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

దివ్యాంగులకు..

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు కుమారులు బెల్లంకొండ మహేష్ కుమార్, మనోజ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మండలకేంద్రంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాలభారతి విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, వేమిరెడ్డి వెంకట్ నారాయణరెడ్డి, శీలం వెంకట్‌రెడ్డి, దగ్గుల నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సతీష్, నరసింహారావు, వేమిరెడ్డి సీతారాంరెడ్డి, కోడూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కల్లూరురూరల్: మండలంలోని గ్రామాల్లోని మురికి కాల్వల్లో నీరు నిలువ ఉండకుండా పంచాయతీల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. డ్రెయినేజీలను శుభ్రం చేస్తూ మురికి నీరు ఎప్పటికప్పుడు వెళ్లే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. గృహ పరిసరాల్లో చెత్తాచెదారం తొలగిస్తూ దోమల వ్యాప్తి ప్రబలకుండా సిబ్బంది ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

గురుకులం పరిశీలన



పాఠశాల షెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీబాపూలే బాలుర గురుకుల పాఠశాలను తహసీల్దార్ పున్నం చందర్, ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శాస్త్రీ మంగళవారం పరిశీలించారు. గురుకుల పాఠశాల గతంలో ఎన్నెస్పీ పాత భవనంలో నిర్వహిస్తుండడంతో అవి శిథిలావస్థలో ఉన్నాయి. వాటిని పరిశీలించి విద్యార్థులను వాటి నుండి ఖాళీ చేయించారు. ఎవరూ ఆ భవనాల వైపు వెళ్లొద్దని సూచించారు.

ఈ నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండండి..

● ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ నాలుగైదురోజులు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆదేశించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలు ఆపదలో ఉండి ఫోన్ చేస్తే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వారంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టాలను అంచనా రూపొందించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. జంగాల కాలనీలో అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, నాటిన మొక్కలను సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని, కబ్జాలకు గురైతే సర్వే చేసి రాజకీయాలకు అతీతంగా ఒత్తిడిలకు తలోగ్గకుండా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈనెల 7 నుంచి జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో శాంతియుతంగా జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. నిమజ్జనానికి చెరువుల వద్ద రెస్క్యూబృందాలను సిద్ధం చేయాలని సూచించారు. కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్, ఐబీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలు మరియన్న, వెంకటేశ్వర్లు, కమిషనర్ రవిబాబు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్‌బాబు, బి.నీరజ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఉంటాం



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వేంసూరు: తుఫాన్, వరదల వల్ల నష్టపోయిన ప్రతీ అన్నదాత కుటుంబానికి అండగా అదుకుంటామని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని జయలక్ష్మీపురం, భీరపల్లి, రాయుడుపాలెం గ్రామాల్లో వర్ష కారణంగా దెబ్బతిన్న పంటలను రహదారుల పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. నాయకులు డాక్టర్ మట్టా దయనంద్ విజయ్ కుమార్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరి సత్యనారాయణరెడ్డి, కనమతరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి అధికారులు తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాలు..

సత్తుపల్లి: మండల పరిధిలోని కాకర్లపల్లి బోడు కాలనీలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు పద్మ, మంజుల, అనిత, ఆశా కార్యకర్తలు జయమ్మ, కుమారి, రాధ పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని ఖాన్‌ఖాన్‌పేటలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో కల్లూరు వైద్యాధికారి నవ్యకాంత్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్ సాకేత్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రేమ్‌కుమార్, సీహెచ్ఓ కాంతమ్మ, హెచ్ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వరావు, వేణుగోపాల్, లతాశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కల్లూరురూరల్: ఖాన్‌ఖాన్ పేటలో..



ఎర్రుపాలెంలో..

దెబ్బతిన్న చెరువులు, రోడ్లకు మరమ్మతులు

బోనకల్: తుఫాన్ బీభత్సానికి మండలంలో ధ్వంసమైన రోడ్లు, తెగిన చెరువులకు అధికారులు మంగళవారం మరమ్మతులు చేయించారు. మండలంలోని ఆళ్లపాడు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసంకాగా అధికారులు మరమ్మతులు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. ముష్టికుంట్ల, కలకోట చెరువులకు గండి పడడంతో వాటిని కూడా పూడ్చివేశారు. కలకోట చెరువు అలుగును పరిశీలించి పంట నష్టం జరగకుండా నీటిని మరలించారు. వందలాది ఎకరాల వరి నీటమునిగింది. వేలాది ఎకరాలలో పత్తి,మిరప తోటలకు తీరని నష్టం వాటిల్లింది.

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతులు నిర్మించారు. గ్రామంలోని బండి రేగు వాగు వర్షాలకు ఉధృతంగా ప్రవహించటంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు పట్టించుకోకపోవటంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శ్రమదానం చేసి రహదారికి మరమ్మతులు చేపట్టారు. కొట్టుకపోయిన రహదారికి మరమ్మత్తు పనులు చేపట్టిన అనంతరం ప్రయాణీకులు వాహనాల రాకపోకలు సాగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ, సిలివేరు సైదులు, సామినేని బాబురావు, అంబటి లచ్చయ్య, కొల్లి బాబు, అంబటి సైదేశ్వరరావు, తోటకూరి నాగేశ్వరరావు, ముప్పిడి వెంకన్న, కందిమళ్ల పుల్లయ్య, వంకాయలపాటి శివ, పాల్గొన్నారు.



బోనకల్: ముష్టికుంట్ల చెరువు గండి పూడ్చి ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం



చింతకాని: మరమ్మతులు చేస్తున్న దృశ్యం